వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

విలేకరులు కావలెను

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను

సంపుటి : 2 | సంచిక : 312 | గురువారం 4 జూలై 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri

- మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, చేరికలు తదితర అంశాలపై సీఎం పార్టీ పెద్దలతో చర్చ
- మంత్రి విస్తరణతో పాటు కేబినెట్ ప్రక్షాళనకు పార్టీ అధిష్ఠానం అమోదం కోసం హస్తినకు సీఎం
- ప్రస్తుత కేబినెట్ స్వరూపం, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అవసరమైన మార్పులు తదితర అంశాల ప్రస్తవన
- ఇప్పటికే మంత్రి పదవుల కోసం పీసీసీ ఖరారు

కొందరికే అవకాశం!



కేబినెట్ విస్తరణ

హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన చేపట్టారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరిన ముఖ్యమంత్రి నేడు పార్టీ అధిష్ఠానంతో భేటీ కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, చేరికలు తదితర అంశాలపై సీఎం పార్టీ పెద్దలతో చర్చించనున్నారు. మంత్రి విస్తరణతో బాటు కేబినెట్ ప్రక్షాళనకు పార్టీ అధిష్ఠానం చేత ఆమోదముద్ర వేయించుకునేందుకే సీఎం హస్తినకు రావటంతో నేటి ముఖ్యమంత్రి హస్తిన పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి కేబినెట్ విస్తరణ గురించి ప్రధానంగా చర్చించనున్నారు. ప్రస్తుత కేబినెట్ స్వరూపం, సామాజిక సమీకరణాల నేపథ్యంలో అవసరమైన మార్పులు తదితర అంశాలను ప్రస్తావించి, ఇప్పటికే మంత్రి పదవుల కోసం పీసీసీ ఖరారు చేసిన 8 మంది సభ్యుల నేపథ్యాలను - మిగతా3లో

పరిపాలనను గాలికి వదిలేశారు

- ప్రతీకారం, పగ మీద దృష్టి పెట్టారు
- కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్‌రావు ఫైర్
- ఏడు నెలల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేవు
- నిధులు లేక గ్రామపంచాయతీలు ఆగమాగం అవుతున్నాయి
- స్కూళ్లల్లో మిడ్ డే మీల్స్ కార్మికులకు జీతాలు లేవు
- రైతుబంధుకు దిక్కు లేదు..

రంగంలోకి కేసీఆర్

- కేడర్‌ను కాపాడుకునేందుకు గులాబీ బాస్ భారీ స్కెచ్
- పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలను ఫామ్ హౌస్‌కు వారితో వరుస భేటీలు
- పార్టీ మారొద్దని, భవిష్యత్ మనదేనని భరోసా కల్పించడంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీలు
- అయితే, కేసీఆర్ బుజ్జిగించినప్పటికీ ఆయన ముందు సరేనని.. తర్వాత కొందరు పార్టీ మారుతున్నారు.
- ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలతో భేటీలు ముగియడంతో సెకండ్ కేడర్‌ను ఎంకరేజ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం

హైదరాబాద్

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో బీఆర్ఎస్ కోటకు బీటలు వారుతున్నాయి. పవర్ కోల్పోవడంతో ఒక్కరొక్కరుగా గులాబీ ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, మరి కొందరు కీలక నేతలు పార్టీ ఛేంజ్ అయ్యారు. బీఆర్ఎస్‌లో వలసల ప్రవాహం మొదలు కావడంతో అడ్డుకట్ట వేసేందుకు అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలను ఫామ్ హౌస్‌కు వారితో వరుస భేటీలు నిర్వహించారు. పార్టీ మారొద్దని, భవిష్యత్ మనదేనని భరోసా కల్పించడంతో పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు. అయితే, కేసీఆర్ బుజ్జిగించినప్పటికీ ఆయన ముందు సరేనని.. తర్వాత కొందరు పార్టీ మారుతున్నారు. ఇటీవల పార్టీ మారిన ఎమ్మెల్యేలు కొందరు ఇదే రీతిలో వ్యవహరించారు.దీంతో గులాబీ బాస్ స్ట్రాటజీ మార్చారు. ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలతో భేటీలు ముగియడంతో సెకండ్ కేడర్‌ను ఎంకరేజ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు - మిగతా3లో

జాబ్ కాలెండర్‌పై కసరత్తు!

- ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త
- రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని సర్కార్ నిర్ణయం
- రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించటంతో
- వార్షిక జాజ్ కేలండర్ తయారీ పనిలో బిజీబిజీగా పబ్లిక్ సర్వీస్ కమిషన్
- ఇప్పటికే పలు నోటిఫికేషన్లు విడుదల కాగా, మంగళవారం ఆర్టీసీలోని 3035 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించటంతో వార్షిక జాజ్ కేలండర్ తయారీ పనిలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ బిజీబిజీగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల వేళ.. నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు నోటిఫికేషన్లు విడుదల కాగా, మంగళవారం ఆర్టీసీలోని 3035 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి కొనసాగింపుగా ఆగస్టులో మరో 6000 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపనుంది. గతంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌తో పాటు గ్రూప్ 2, 3 - మిగతా3లో

జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ మళ్లీ పగ్గాలు?

- హేమంత్ సోరెన్ తిరిగి సీఎం పగ్గాలు చేపట్టనున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం
- ల్యాండ్ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన హేమంత్ సోరెన్‌కు జార్ఖాండ్ హైకోర్టు బెయిలు మంజూరు
- అరెస్టుకు ముందు జనవరి 31న ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.
- హేమంత్ సోరెన్‌ను జేఎంఎం లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది

గురుశిష్యులు కాదని.. సహచరులు మాత్రమే

- చంద్రబాబు, రేవంత్ బంధంపై డిప్యూటీ సీఎం భట్టి కీలక వ్యాఖ్యలు
- చంద్రబాబు, రేవంత్ గురుశిష్యులు అనే వారివి అవగాహనలే
- ఏడు మండలాలు పోవడానికి కారణం బీఆర్ఎస్, బీజేపీనే
- ఏడు మండలాల కోసం బీఆర్ఎస్ దీక్ష చేయాలని డిమాండ్
- విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావన లేదు
- పీసీసీ నూతన చీఫ్ విషయంలో కసరత్తు కొనసాగుతుంది

హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీపై సర్వాత్ర ఆసక్తి నెలకొంది. ఈనెల 6వ తేదీన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశం కానున్నారు. అయితే గురుశిష్యులు భేటీ కాబోతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి గురుశిష్యులు కాదని.. సహచరులని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని రేవంత్ చాలా సార్లు చెప్పారన్నారు. చంద్రబాబు ఏపీ సీఎం, రేవంత్ తెలంగాణ సీఎం అని తేల్చిచెప్పారు. చంద్రబాబు, రేవంత్ గురుశిష్యులు అనే వారివి అవగాహనలేని మాటలని కొట్టిపారేశారు. పదేండ్ల పెండింగ్ సమస్యలను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చిస్తారని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఏడు మండలాలు పోవడానికి - మిగతా3లో

హత్రాస్ దుర్ఘటనపై రష్యా అధ్యక్షుడు పుతిన్ తీవ్ర ఆవేదన

లఖ్‌నవూ: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లాలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సంతాపం తెలిపారు. ఈ వార్త తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీకి పంపిన సందేశంలో ఆయన ఈ ఘటనపై సంతాపం తెలియజేశారు. కాగా మంగళవారం జరిగిన ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య ఇప్పటి వరకు 120కి చేరింది.



త్వరలో రష్యాకు మోదీ!

ప్రధాని మోదీ వచ్చే వారం రష్యాలో పర్యటించనున్నారు. అయితే ఆయన పర్యటన షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదని అధికారులు తెలిపారు. రష్యా పర్యటన జరిగితే దాదాపు 5 ఏళ్ల తరువాత మోదీ రష్యాకు వెళ్లడం ఇదే తొలిసారి అవుతుంది. 2019లో మోదీ చివరిసారిగా ఫార్ ఈస్ట్ సిటీ వ్లాడివోస్టాక్‌లో జరిగిన ఆర్థిక సమావేశానికి హాజరయ్యారు. రష్యాలో పర్యటిస్తున్న క్రమంలోనే ప్రధాని మోదీ ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ కలిపి భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ఇరు దేశాల మధ్య 21 వార్షిక శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి.

ఘటనకు కారణమిదే..

యూపీలోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందిన భోలే బాబా.. గతంలో పోలీసు శాఖ నిఘా విభాగంలో 18 ఏళ్లపాటు పనిచేసి, ఆ తర్వాత ఉద్యోగం మానేసి ఆధ్యాత్మిక గురువుగా మారారు. స్థానికులు ఆయనను 'నారాయణ సాకార్ హరి'.. 'సాకార్ విశ్వ హరి బాబా' అనే పేర్లతో పిలుచుకుంటారు. ప్రతి మంగళవారం ఆయన నిర్వహించే సత్సంగానికి ప్రజలు వేలాదిగా హాజరవుతుంటారు. యూపీ నుంచే కాక.. హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కూడా భోలేబాబా సత్సంగాలకు రావడం కద్దు. ఫేస్‌బుక్‌లోనే ఆయనకు 3 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఈ క్రమంలోనే.. మంగళవారం హత్రాసలో ఆయన నిర్వహించిన సత్సంగానికి ప్రజలు పెద్దఎత్తున వచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత.. బయటకు వెళ్లే సమయంలో తోపులాట జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. లోపల వాతావరణమంతా ఉక్కగా ఉండడంతో అంతా త్వరగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారని.. కానీ ఆ ద్వారం చిన్నగా ఉండడంతో తొక్కిసలాట జరిగి ఇంతమంది ప్రాణాలు కోల్పోయారని వారు వివరించారు. మరికొందరేమో..కార్యక్రమం చివర్లో భక్తులు భోలేబాబాను దగ్గర్నుంచీ చూడడానికి, ఆయన పాద ధూళిని తీసుకోవడానికి ప్రయత్నించే క్రమంలో ఈ ఘోరం జరిగినట్టు చెబుతున్నారు.

రోడ్డు పక్కగా నడిచి వెళ్తున్న వృద్ధుడ్ని ఢీకొట్టిన కారు..

ముంబై: రోడ్డు పక్కగా నడిచి వెళ్తున్న వృద్ధుడ్ని ఒక కారు ఢీకొట్టింది. దీంతో అతడు గాల్లోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధుడు చికిత్స పొందుతూ మరణించాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మల్కాపూర్ మీదుగా వెళ్లే 53వ జాతీయ రహదారి పక్కగా ఒక వృద్ధుడు నడిచి వెళ్తున్నాడు. వేగంగా వచ్చిన ఒక కారు అతడ్ని ఢీకొట్టింది. దీంతో గాలిలోకి ఎగిరి దూరంగా పడ్డాడు. కొంత దూరం ముందుకు వెళ్లిన కారును డ్రైవర్ ఆపాడు. చుట్టూ చూసిన తర్వాత కారులో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా, ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆ వృద్ధుడు చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడ్ని బుద్రుక్‌కు చెందిన నామ్‌దేవ్ కవాలేగా గుర్తించారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ఆ కారు గుజరాత్‌కు చెందినగా నంబర్ ప్లేట్ ద్వారా గుర్తించారు. వృద్ధుడ్ని ఢీకొట్టి పరారైన కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

రాజ్యాంగ పదవిని ఎవరైనా గౌరవించాల్సిందే ఖర్గే వాకౌట్‌పై పవార్

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదులు తెలిపే తీర్మానంపై మోదీ మాట్లాడుతుండగా ప్రతిపక్ష నాయకుడు ఖర్గేని మాట్లాడాలనివ్వాలని విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేయడం, చివరకు వారు సభ నుంచి వాకౌట్ చేయడంపై ఎన్‌సీపీ-ఎస్‌సీపీ చీఫ్ శరద్ పవార్ స్పందించారు. మల్లికార్జున్ ఖర్గే ప్రతిపక్ష నేతగా రాజ్యాంగ పదవిలో ఉన్నందున ఆయనను ప్రధానమంత్రి మోదీ, రాజ్యసభ చైర్మన్ గౌరవించాల్సి ఉంటుందని అన్నారు.

'ఆయన (ఖర్గే) రాజ్యాంగ పదవిలో ఉన్నారు. ప్రధాని కావచ్చు, సభ చైర్మన్ కావచ్చు, ఆయనను గౌరవించాలి. కానీ ఇవాళ ఆ విషయాన్ని విస్మరించారు. ప్రతిపక్షం మొత్తం ఆయనకు (ఖర్గే) మద్దతుగా నిలిచింది. ఆ కారణంగానే మేమంతా వాకౌట్ చేశాం" అని పవార్ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.

మోదీ కొన్ని అవస్తవాలు చెప్పారు..

కాగా, రాష్ట్రపతి ప్రసంగంపై ప్రధాని సభలో మాట్లాడుతున్నప్పుడు కొన్ని అవాస్తవాలు చెప్పారని, దానికి నిరసనగానే విపక్ష సభ్యులు వాకౌట్ చేశారని ఖర్గే తెలిపారు. బీఆర్ అంబేద్కర్‌ను పండిట్ నెహ్రూ అవమానించారంటూ నిన్న లోక్‌సభలో, ఇవాళ రాజ్యసభలో మోదీ పదేపదే చెబుతున్నారని, రాజ్యాంగ సభలో బాబాసాహెబ్ ఏంచెప్పారో, ఆర్ఎస్ఎస్ ఆర్గనైజర్‌లో ఏమి రాసిందో తాను చెప్పాలనుకున్నానని, చైర్మన్‌ను ఎంత అభ్యర్థించినా ఆయన అవకాశం ఇవ్వలేదని ఖర్గే చెప్పారు. అబద్ధాలు చెప్పడం మోదీకి అలవాటుగా మారిందని విమర్శించారు.

ఏళ్లుగా కనిపించని మహిళ హత్యకు గురైందన్న పోలీసులు

తిరువనంతపురం: సుమారు 15 ఏళ్ల కిందట అదృశ్యమైన మహిళ హత్యకు గురైందని పోలీసులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన ఆధారాలు లభించాయని తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు చెప్పారు. అయితే పోలీసుల వాదనను మహిళ కుమారుడు నిరాకరించాడు. తన తల్లి బతికే ఉందని (%హ్వవ%'%ం ూశ్రీఅజవ%) మీడియాతో అన్నాడు. కేరళలోని అలప్పుజ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 20 ఏళ్ల వయస్సున కాలా అనే మహిళ 15 ఏళ్ల కిందట అదృశ్యమైంది. ఈ కేసుపై దర్యాప్తు జరిపిన పోలీసులు అందిన ఒక లేఖ ఆధారంగా మంగళవారం ఆమె భర్త ఇంట్లోని రెండు సెప్టిక్ ట్యాంక్‌లను తెరిపించి వెతికించారు. మనిషి ఎముకలు, కొన్ని రసాయనాలను కనుగొన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇజ్రాయెల్‌లో ఉంటున్న భ ర్తే, భార్య కాలాను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కొందరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కాగా, తన తల్లి హత్యకు గురైందన్న పోలీసుల స్టేట్‌మెంట్‌ను ప్రస్తుతం యువకుడైన కాలా కుమారుడు ఖండించాడు. ఆమె బతికే ఉందని తెలిపాడు. 'అలాంటి (హత్య) ఘటనేమీ జరుగలేదు. మా అమ్మ బతికే ఉందని నాకు నమ్మకం ఉంది. నేను ఆమె కొడుకుని. నాకు టెన్షన్ లేదు' అని మీడియాతో అన్నాడు. మరోవైపు విదేశాల్లో ఉన్న తండ్రిపైనా ఆ యువకుడు ఎలాంటి అనుమానం వ్యక్తం చేయలేదు. 'దీని గురించి ఒత్తిడికి గురికావద్దని మా నాన్న చెప్పారు. కొంత అప్పు ఉండటంతో ఇప్పుడే దేశానికి తిరిగి రాలేనని ఆయన అన్నారు' అని వెల్లడించాడు.

132 సీటర్.. ట్రైన్ లాంటి సరికొత్త బస్సులు.. విమానం తరహాలో సౌకర్యాలు

విదేశాల్లో ఇప్పటికే ట్రైన్ తరహాలో పొడవుగా ఉండే బస్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో వంద మందికి పైగా ప్రయాణం చేయొచ్చు. అవి చూసినప్పుడల్లా.. భారతదేశంలో ఇలాంటివి ఎప్పుడు వస్తాయో? అని మనం అనుకుంటుంటాం. అయితే.. ఇప్పుడు ఆ నిరీక్షణకు త్వరలోనే చెక్ పడబోతోంది. అవును.. మీరు చదువుతోంది అక్షరాలా నిజం. కేంద్ర ప్రభుత్వం అటువంటి పొడవాటి బస్సులను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కూడా ప్రారంభమైంది. ఈ విషయాన్ని స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ (%చీఙఅఅ +ఘఎఎఘతీఅ%) ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



132 సీటర్ బస్సు

132 సీట్లతో కూడిన బస్సులను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నామని.. ఇందుకోసం నాగ్‌పూర్‌లో పైలట్ ప్రాజెక్టు కొనసాగుతోందని నితిన్ గడ్కరీ చెప్పారు. తాను చెక్ రిపబ్లిక్‌కు వెళ్లినప్పుడు.. అక్కడ మూడు బస్సులు కలిపి ఒకే ట్రాలీ బస్సుగా ఉండటాన్ని తాను చూశానని అన్నారు. అలాంటి బస్సులను భారత్‌లో ఎందుకు తీసుకురాకూడదని అనిపించిందని పేర్కొన్నారు. ఈ విషయంపై చర్చలు జరిపి, టాటా సహకారంతో నాగ్‌పుర్‌లో ఓ పైలట్ ప్రాజెక్టు చేపట్టామని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా.. 132 మంది కూర్చునే విధంగా బస్సును రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఇంధనంతో కాకుండా బ్యాటరీతో నడిచేలా వీటిని తయారు చేస్తున్నామన్నారు. ప్రతి ఛార్జింగ్‌కి 40 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తుందని.. కేవలం 40 సెకన్లు ఛార్జింగ్ చేస్తే మరో 40 కి.మీ. వెళ్లొచ్చని చెప్పారు. దీంతో.. ఒక్క కిలోమీటర్‌కి రూ.40 మాత్రమే ఖర్చవుతుందని వివరించారు.

సౌకర్యాలు

అంతేకాదు.. ఈ బస్సులో విమానం తరహాలో సౌకర్యాలు ఉంటాయని నితిన్ గడ్కరీ తెలిపారు. ఎలాగైతే విమానంలో సీటింగ్ ఉంటుందో.. అలాగే ఇందులోనూ సీట్లు అమర్చబడి ఉంటాయన్నారు. సీటు ముందు ల్యాప్‌టాప్ పెట్టుకునే సౌలభ్యమూ ఉంటుందన్నారు. ఎయిర్ హోస్టెస్‌లాగా బస్ హోస్టెస్ కూడా ఉంటారని.. వీళ్లు పండ్లు, ఆహారం, శీతల పానీయాలు అందిస్తారన్నారు. డీజిల్ బస్సుతో పోలిస్తే.. దీని నిర్వహణకు 30 శాతం వరకు ఖర్చు తగ్గుతుందని వెల్లడించారు. మన దేశంలో కాలుష్యం అనేది అతిపెద్ద సమస్యగా మారిందని.. ఈనేపథ్యంలో వ్యక్తిగత, ప్రజారవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు కాలుష్య రహిత మార్గాలను అన్వేషిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాలు వచ్చాయని చెప్పుకొచ్చారు.

జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్ మళ్లీ పగ్గాలు?

రాంచీ: జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తిరిగి సీఎం పగ్గాలు చేపట్టనున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు జేఎంఎం సారథ్యంలోని కూటమి ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కుదిరినట్టు తెలుస్తోంది. ల్యాండ్ స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన హేమంత్ సోరెన్‌కు జార్ఖాండ్ హైకోర్టు బెయిలు మంజూరు చేయడంతో జూన్ 28న ఆయన బిర్సా ముండా సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. అరెస్టుకు ముందు జనవరి 31న ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. జేఎంఎం వర్గాల సమాచారం ప్రకారం, ముఖ్యమంత్రి చంపయి సోరెన్ నివాసంలో హేమంత్ సోరెన్‌ను జేఎంఎం లెజిస్లేచర్ పార్టీ నేతగా ఎన్నుకోవాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ సమావేశానికి జేఎంఎం ఎమ్మెల్యేలతో పాటు కూటమి ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యారు. కాంగ్రెస్ జారా?ండ్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్, హేమంత్ సోరెన్ సోదరుడు బసత్, భార్య కల్పన కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. చంపయి సోరెన్ స్థానంలో తిరిగి హేమంత్ సోరెన్‌ను సీఎం పగ్గాలు అప్పగించాలని కూడా సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించినట్టు చెబుతున్నారు. ఇదే జరిగితే, 20200 నవంబర్ 15న బీహార్ నుంచి ప్రత్యేక రాష్ట్రంగా జారా?ండ్ ఏర్పడినప్పటి నుంచి ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సోరెన్ పగ్గాలు చేపట్టడం ఇది మూడోసారి అవుతుంది.

నిందితులపై కఠిన చర్యలు చేపడతాం : కిరణ్ రిజిజు

నీట్ వివాదంపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన నిందితులపై కఠిన చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. మంత్రి బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రశ్నాపత్రాల నిరోధక చట్టం అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం కింద నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నీట్ వివాదంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులపై చర్యలు చేపడతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంగా తెలిపారని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌ను నిరోధించేందుకు కఠిన చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు. నీట్ వ్యవహారంపై ప్రధాని ఇప్పటికే భరోసా ఇచ్చారని, కఠిన చట్టాన్ని ఆమోదించడం జరిగిందని గుర్తుచేశారు. విపక్షాలు మోదీని ఉదయం నుంచి రాత్రి వరకూ నిందిస్తుంటాయని, మళ్లీ భావ ప్రకటన స్వేచ్ఛ లేదని అంటుంటారని మండిపడ్డారు. లోక్‌సభలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని అడ్డుకుంటూ సభలో కాంగ్రెస్ పార్టీ గందరగోళం సృష్టించిందని మంత్రి ఆరోపించారు. ప్రధాని ప్రసంగానికి అవాంతరాలు కల్పించడం విపక్ష ఆనవాయితీగా మారిందని దుయ్యబట్టారు.

పార్లమెంట్‌లో మోదీ ఎన్నికల ప్రసంగం జైరాం రమేష్

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వక్రీకరించి, తప్పుదారిపట్టించిన తీరు చూస్తే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రసంగం చేసినట్టు ఉందని, పార్లమెంట్‌లో మాట్లాడిన తరహాలో లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ఆరోపణలు చేశారని, కానీ వాటిని తిప్పికొట్టేందుకు మల్లికార్జున్ ఖర్గే లేచి నిలుచున్నా ఆయనకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రధాని పార్లమెంట్ వేదికగా అసత్యాలు వల్లెవేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు మెజారిటీ రాకపోయినా ఆయనకూ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాలేదనే విషయం ప్రధాని అర్థం చేసుకోవాలని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు మోదీకి వ్యక్తిగతంగా, నైతికంగా, రాజకీయంగా నష్టం చేకూర్చాయనే విషయం ఆయన గుర్తెరగాలని చెప్పారు. ప్రధాని మోదీ మూడింట ఓ వంతు ప్రధాని అని తాను అంటే ఆయన దాన్ని కూడా వక్రీకరించి తాను మూడింట ఓ వంతు ప్రభుత్వమని అన్నట్టు ప్రచారం చేశారని చెప్పారు. నాయుడు, నితీష్ లేకుంటే మోదీ ప్రధాని కాలేరని పేర్కొన్నారు. మోదీ 240 దగ్గరే ఆగిపోయారు..ఆయనకు అనుకూలంగా ప్రజా తీర్పు రాలేదని వివరించారు. ఆయన మూడోసారి ప్రధాని కావడం వాస్తవమే అయినా ఆయనకు మెజారిటీ మాత్రం దక్కలేదని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు.

మద్యం పాలసీ కేసు.. కేజ్రీవాల్ కస్టడీని 12 వరకు పొడిగించిన కోర్టు..



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కష్టాలు కొనసాగుతున్నాయి. మద్యం పాలసీ కేసులో సీఎం కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 12 వరకు పొడిగించింది. కేజ్రీవాల్‌ను ఈడీ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచింది. ఇంతకుముందు ఈడీ జూన్ 29న సీబీఐ కోర్టు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ప్రత్యేక సీబీఐ కోర్టు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో గత నెల 26న సీబీఐ అరెస్టు చేసిన విషయం విధితమే. ఆ తర్వాత మూడురోజులు సీబీఐ కస్టడీకి తీసుకోగా.. రిమాండ్ గడువు ముగియగా 29న కోర్టులో హాజరుపరిచింది. దీంతో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆప్ కన్వీనర్‌కు జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఆ తర్వాత స్టేపై సవాల్ చేయగా.. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన తిహార్ జైలులో ఉంటున్నారు.

కొందరికే అవకాశం!

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి పార్టీ పెద్దలకు వివరించనున్నారు. అదే సమయంలో పీసీసీ అధ్యక్షుడి ఎంపికపైనా తన అభిప్రాయాలను పార్టీ పెద్దలతో చర్చిస్తారు. తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి సాగుతున్న వలసలు, వాటి పర్యవసానాలనూ నియోజక వర్గాల వారీగా అధిష్ఠానం పెద్దలతో సీఎం పంచుకోనున్నారు.ప్రస్తుత కేబినెట్‌లో ఆరు స్థానాలు ఖాళీగా ఉండగా, అందులో ప్రస్తుతం నాలుగు బెర్త్‌లను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ఇప్పటి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు గనుక ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ జిల్లాలకు అవకాశం రావచ్చని తెలుస్తోంది. అదే జరిగితే నిజామాబాద్ జిల్లా నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన రెడ్డికి, ఆదిలాబాద్ నుంచి వివేక్ లేదా కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావులలో ఒకరికి బెర్త్ ఖాయమని చెబుతున్నారు. ఇక.. తెలంగాణలో బలమైన ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేనందున మక్తల్ నుంచి ఎన్నికైన వాకిటి శ్రీహరికి అవకాశం దక్కొచ్చని, గత లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం దీనిపై మాట్లాడారని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మునుగోడు, ఖైరతాబాద్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేల పేర్లు కూడా ఆశావహుల జాబితాలో ముందువరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.ప్రధానమైన ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో పాలనపై ఫోకస్ చేసి, మంచి ఫలితాలను సాధించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణతో బాటు మంత్రి వర్గ ప్రక్షాళన కూడా చేపట్టనున్నారు. ఈ క్రమంలో మంత్రుల ప్రస్తుత శాఖల్లో మార్పులు చేర్పులు జరగనున్నాయి. ఈ ప్రక్షాళనలో భాగంగా హోం మంత్రిగా సీతక్కను నియమిస్తారని తెలుస్తోంది. దీనికి పార్టీ అధిష్ఠానం ఆమోదముద్ర కూడా ఉందని, మరో నలుగురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మంత్రుల నేపథ్యం, ఆసక్తి, అనుభవం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేబినెట్ ప్రక్షాళన జరగనుంది.పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి మూడేళ్ల పదవీ కాలం పూర్తయిన వేళ.. కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఇప్పటికే ఇప్పటికే టీపీసీసీ అభిప్రాయాలను సేకరించిన అధిష్ఠానం మొత్తంగా దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీనిపై గతవారమే సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీలోని పెద్దలకు తమ అభిప్రాయాలను వివరించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పీసీసీ రేసులో ఎస్సీ కోటాలో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, బీసీ కోటాలో మహేశ్‌కుమార్ గౌడ్, ఎస్టీల నుంచి బలరాం నాయక్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. కాగా.. రెడ్డి సామాజిక వర్గానికి ముఖ్యమంత్రిత్వం దక్కింది గనుక పీసీసీ పదవిని బీసీలకు ఇవ్వాలనే పాత సంప్రదాయాన్ని ఇప్పుడూ పార్టీ అధిష్ఠానం పాటించనునుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ మంగళవారం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దీంతో కొత్త టీపీసీసీ అధ్యక్షుడి పదవికి మహేశ్‌కుమార్ గౌడ్ పేరు ఫైనల్ అయిందనే ప్రచారం సాగుతోంది.ఇప్పటివరకు చేరిన ఎమ్మెల్యేలకు తోడు.. కొత్తగా పార్టీలో చేరాలని ఆసక్తి కనబరుస్తున్న వారి వివరాలనూ ముఖ్యమంత్రి పార్టీ పెద్దలకు వివరించనున్నట్లు తెలుస్తోంది. మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డితో బాటు దాదాపు ఏడెనిమిది మంది క్యూలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరుగాక మరో 10 మంది శాసన మండలి సభ్యులు కూడా పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీరి చేరికల మీద కూడా సీఎం చర్చించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు సంబంధించి రాజభవన్ అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి దీనిపై సమాచారం మిచ్చినట్లు తెలుస్తోంది. జులై 2న ఏకాదశి కావటంతో ఆరోజు కేబినెట్ విస్తరణ చేయాలని ముందుగా కొందరు సూచించినా, మంగళవారం కావటంతో దీనిని గురువారానికి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. త్రయోదశి, గురువారం కలిసి వచ్చిన కారణంగా 4 న ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది.

జాబ్ కాలెండర్‌పై కసరత్తు!

-మొదటిపేజీ తరువాయి

పోస్టులు పెంచాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీంతో వీలున్నంత వేగంగా, పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సమయంలో ఇప్పటికే రాత పరీక్ష దశలో ఉన్న నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేసి ఫలితాలు ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సూచనలు చేస్తోంది.ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్టీసీలో దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో మంగళవారం 3035 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే ఆర్టీసీలో 43వేల మంది పనిచేస్తుండగా, తాజాగా ఈ కొత్త నోటిఫికేషన్ విడుదల చేశారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కారణంగా.. ఈ నోటిఫికేషన్‌లోని డ్రైవర్, శ్రామిక్, డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్), డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) తదితర ఉద్యోగాలను వీలున్నంత త్వరగా భర్తీ చేసి మరింత మెరుగైన ప్రయాణ సేవలను అందించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారుగతంలో విడుదలైన నోటిఫికేషన్లకు సంబంధించి రాత పరీక్షల దశలో ఉన్నవాటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం గ్రూప్ 4 పరీక్ష పూర్తై, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. గతంలో రద్దైన గ్రూప్ 1 నోటిఫికేషన్‌కు మరిన్ని పోస్టులు కలిపి కొత్త ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి, ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరగనున్నట్లు కమిషన్ ప్రకటించింది. అలాగే, డీఎస్సీ పరీక్షల షెడ్యూల్ కూడా విడుదలైంది. గ్రూప్ 2 పరీక్షను ఆగస్టులో

నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీతో రద్దైన డీఈవో లాంటి పరీక్షలు జరుగుతున్నాయి. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పరీక్షలు పూర్తయ్యాయి. గురుకులాలకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయి పోస్టింగ్‌ల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. ఆ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేయనున్నారు. ఈ పెండింగ్ నోటిఫికేషన్లు అన్నీ పూర్తై వీటి ఫలితాలు ప్రకటించగానే కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.రాబోయే అసెంబ్లీ సమావేశాల నాటికి జాబ్ క్యాలెండర్‌తో పాటు కొత్త నోటిఫికేషన్ల మీద ప్రభుత్వం ఒక క్లారిటీకి రానుంది. అలాగే నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రకటన చేసింది. కొడంగల్, మధిర నియోజక వర్గాల్లో 20 ఎకరాల విస్తీర్ణంలో ఒకేచోట ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ, మైనారిటీ గురుకులాలన్నింటినీ ఒకే ప్రాంగణంలోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో ఈ కేంపస్‌లు అందుబాటులోకి వస్తే.. ఇప్పుడున్న గురుకులాల సిబ్బందికి తోడు మరో 4 వేల మంది అవసరం కావచ్చు. వీటికి ఖాళీగా ఉన్న మరో 2 వేల ఉద్యోగాలు కలిపి.. మొత్తం 6 వేల పోస్టులతో నోటిఫికేషన్ వేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

పరిపాలనను గాలికి వదిలేశారు

మెదక్ : రాష్ట్రంలో పరిపాలనను గాలికి వదిలేశారు.. ప్రతీకారం, పగ మీద దృష్టి పెట్టారని కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఏడు నెలల్లోనే పల్లెలు మురికి కూపాలుగా మారాయి. ఒక్క రూపాయి కూడా గ్రామపంచాయతీలకు ఇవ్వలేదు. ఏడు నెలల నుంచి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేవు. నిధులు లేక గ్రామపంచాయతీలు ఆగమాగం అవుతున్నాయి. స్కూళ్లల్లో మిడ్ డే మీల్స్ కార్మికులకు జీతాలు లేవు. కరెంట్ బిల్లు కట్టలేదని ఓ స్కూల్‌కు కరెంట్ చేశారు. పాలనను గాలికి వదిలేశారు. ఎక్కడా చూసిన ఆత్మహత్యలు, హత్యలు, మానభంగాలు జరుగుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు.

రైతుబంధుకు దిక్కు లేదు..

ఖమ్మం జిల్లాలో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో మరో రైతు పురుగుల మందు తాగేందుకు యత్నించాడు. పరిపాలను గాలికి వదిలేసి కేవలం ప్రతిపక్షాల మీద కేసులు పెట్టడం పనిగా పెట్టుకున్నారు. శాంతి భద్రతలు ఆగమయ్యాయి. రైతుబంధుకు దిక్కు లేదు. జులై వచ్చినా ఒక్క రూపాయి ఇవ్వకుండా రైతుల ఉసురు పోసుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జూన్ నెలలోనే రైతుబంధు ఇచ్చేవాళ్లం. రైతుబంధు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఇప్పటికి చాలా చోట్ల వరి నాట్లు పడలేదు. కేవలం మూడు శాతం మాత్రమే వరి నాట్లు పడ్డాయని హరీశ్‌రావు తెలిపారు.

మళ్లీ కేసీఆర్‌ను గెలిపించుకుంటారు..

కేసీఆర్ 200 పెన్షన్‌ను రూ. 2 వేలు చేసి ఇచ్చిండు. కాంగ్రెసోళ్లు పెన్షన్ల కింద రూ. నాలుగు వేలు ఇస్తమన్నరు.

ఇప్పటి వరకు ఇవ్వలేదు. ఇంటికి రెండు పెన్షన్లు అన్నారు అతీగతీ లేదు. మే, జూన్ నెల పెన్షన్లు బాకీ పడ్డారు. ఏప్రిల్ నెల పెన్షన్ జూన్ 25కు ఇచ్చారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఏడు నెలల నుంచి రావట్లేదు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ బంద్ అయ్యాయి. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు రోడ్లెక్కారు. ఎవర్నీ ఉద్ధరించారు మీరు. పరిపాలనను గాలికి వదిలేశారు.. కేవలం ప్రతీకారం, పగ మీద దృష్టి పెట్టారు. తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రజలు ఊరుకోరు.. ఎన్నికలు రాక తప్పదు.. మళ్లీ కేసీఆర్‌ను గెలిపించుకుంటారు. అందరూ ధైర్యంగా ఉండండి. తప్పకుండా అందరికీ భవిష్యత్ ఉంటది. కార్యకర్తలు అధైర్యపడొద్దు మనకు మంచి రోజులు వస్తాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పకుండా వస్తది. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి అని హరీశ్‌రావు పిలుపునిచ్చారు.

పదవికి విరమణ ఉంటుంది..
ప్రజాసేవకు విరమణ ఉండదు

ప్రజా జీవితంలో పదవికి విరమణ ఉంటుంది.. కానీ ప్రజాసేవకు విరమణ ఉండదు అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. నాయకుడు అనే వాడు నిత్యం ప్రజల్లోనే ఉండాలని ఆయన సూచించారు. దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలకు స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రసంగించారు. ఆయా మండలాలు, గ్రామాల అభివృద్ధికి ఐదేండ్ల పాటు కష్టపడి పని చేసిన మీరంతా పదవీ విరమణ పొందుతున్న సందర్భంలో మిమ్మల్ని కొత్త ప్రభాకర్ రెడ్డి సన్మానించడం గొప్ప విషయం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ మంచి మెజార్టీ తీసుకొచ్చినందుకు దుబ్బాక ప్రజలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ప్రభాకర్ గెలుపునకు అద్భుతంగా కృషి చేశారు. పదవికి విరమణ ఉంటుంది. కానీ ప్రజా సేవకు విరమణ ఉండదు. రేపట్నుంచి మాకేం సంబంధం లేదు అనుకోకండి. మీరు తప్పకుండా మండలాలు, గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలని హరీశ్‌రావు కోరారు. మీలో చాలా మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో ఆపరేటివ్ చైర్మన్లు అవుతారు. మీ సేవలను పార్టీ ఉపయోగించుకుకుంటుంది. సముచితమైన స్థానం కల్పిస్తాం. రాజకీయాల్లో గెలుపోటములు ఉంటాయి. ఓటమి తర్వాత తప్పకుండా గెలుపు వస్తది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తది అని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

రంగంలోకి కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి

పార్టీ వీడిన వారి వెంట సెకండ్ కేడర్ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు టాక్. ఎమ్మెల్యేలు పార్టీ వీడిన సెకండ్ కేడర్ బలంగా ఉంటే.. క్షేత్ర స్థాయిలో పార్టీకి ఏ ప్రాబ్లమ్ ఉండదని.. ఈ వ్యూహంలో భాగంగానే సెకండ్ కేడర్‌ను ప్రోత్సహించాలని ఆయన ఆలోచిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే లోకల్ బాడీ ఎలక్షన్స్ ఉండటం కూడా ఈ ప్లాన్‌కు మరింత కలిసి వస్తుందని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే 21 జిల్లాల జెడ్పీ చైర్మన్లతో ఫామ్ హౌజ్‌లో కేసీఆర్ భేటీ అయ్యారు. జెడ్పీ చైర్మన్లతో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా సమావేశానికి ఆహ్వానించారు.జెడ్పీ చైర్మన్‌లతో కలసి లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసిన కేసీఆర్.. పార్టీ మారొద్దంటూ ఈ సందర్భంగా వారిని బుజ్జిగించినట్లు టాక్. ఎమ్మెల్యేలు పార్టీ మారిన వారి వెంట వెళ్లొద్దని.. మీరు పార్టీలోనే ఉండాలని కేసీఆర్ చెప్పినట్లు సమాచారం. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, పార్టీకి కష్టకాలంలో అండగా ఉన్నవారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తానని సైతం గులాబీ బాస్ హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 20 మంది జెడ్పీ చైర్మన్‌లతో భేటీ అయ్యారు. జెడ్పీ చైర్మన్‌లతో కుటుంబ సమేతంగా లంచ్ మీటింగ్‌కు ఎర్రవెల్లి ఫాంహౌజ్‌కు కేసీఆర్ ఆహ్వానించారు. వీరితో నిర్వహించిన సమావేశంలో పార్టీ మారొద్దని కేసీఆర్ బుజ్జగించినట్టు తెలిసింది. భవిష్యత్ బీఆర్ఎస్ పార్టీదేనని, మళ్లీ గులాబీ పార్టీ అధికారంలోకి వస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెంట నిలిచిన నాయకులను మరిచిపోబోమని, భవిష్యత్‌లో వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఎమ్మెల్యేలు పార్టీ మారినా.. జెడ్పీ చైర్మన్లు పార్టీ మారొద్దని సూచించినట్టు తెలిసింది. సెకండ్ కేడర్‌ను ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో కేసీఆర్ తాజాగా జెడ్పీ చైర్మన్‌లతో జరిపిన సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా సెకండ్ కేడర్ ప్రాధాన్యతను నొక్కి చెబుతున్నారు. జగిత్యాలలో ఇటీవల మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినా.. సెకండ్ కేడర్, కార్యకర్తలు పార్టీపై అచంచల విశ్వాసంతో ఉన్నారని, తమ పార్టీ బలం కూడా వాళ్లేనని పేర్కొన్నారు. పార్టీ మారే ఎమ్మెల్యేలను కట్టడి చేయలేమని ఓ ప్రాథమిక అంచనాకు వచ్చిన తర్వాత గులాబీ పార్టీ సెకండ్ కేడర్‌ను కాపాడుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. సెకండ్ కేడర్ బలంగా ఉంటే వచ్చే ఏ ఎన్నికల్లోనైనా ప్రత్యర్థి పార్టీలను ఢీకొట్టే సామర్థ్యం ఉంటుందని భావిస్తున్నట్టు చర్చ జరుగుతున్నది.ఎమ్మెల్యేలతో భేటీలు ముగిసిన వెంటనే కేసీఆర్ సెకండ్ కేడర్‌తో భేటీ కావడంతో ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తుంది. ఎప్పుడు ఏ ఎమ్మెల్యే పార్టీ మారుతారో తెలియని పరిస్థితి నెలకొనడంతోనే సెకండ్ కేడర్‌ను ఎంకరేజ్ చేయాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. గులాబీ పార్టీలో ఎమ్మెల్యేల వలసల పర్వం కంటిన్యూ అవుతోన్న వేళ సెకండ్ కేడర్‌ను ప్రోత్సహించాలనుకున్న కేసీఆర్ వ్యూహం ఏ మేరకు ఫలిస్తోందో చూడాలి.

గురుశిష్యులు కాదని.. సహచరులు మాత్రమే

-మొదటిపేజీ తరువాయి

కారణం బీఆర్ఎస్, బీజేపీనే అని వ్యాఖ్యలు చేశారు. ఏడు మండలాల కోసం బీఆర్ఎస్ దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావన లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆర్డినెన్సుతో ఏడు మండలాలను ఏపీలో కలిపారని చెప్పుకొచ్చారు. ఏడు మండలాల కోసం పోరాటం చేస్తానని అసెంబ్లీలో చెప్పిన కేసీఆర్ ఏమయ్యారని ప్రశ్నించారు. కేబినెట్ విస్తరణపై పూర్తిగా అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. పీసీసీ నూతన చీఫ్ విషయంలో కసరత్తు కొనసాగుతుందన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని వెల్లడించారు. పదిహేనేండ్లు తామే అధికారంలో ఉంటామని చెపుతున్న కేసీఆర్ వి కల్లిబొల్లి కబుర్లే అంటూ విమర్శించారు. రైతు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని.. పుట్టింది బతకడానికి... చావడానికి కాదని అన్నారు. ఆత్మహత్య వెనుక ఎవరున్నారనే దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఆత్మహత్య వెనక ఎవరున్నా విడిచిపెట్టేది లేదని స్పష్టం చేశారు. హరీష్ రావు కల్లిబొల్లి మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పిదాలు ఆయన్ని వెంటాడుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషీయల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో జులై 25వ తేదీ వరకు కవిత, మనీష్ సిసోడియా కస్టడీ పొడిగిస్తున్నట్లు రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది. ఈడీ కేసులో నేటితో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యూడిషిల్ కస్టడీ ముగిసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవిత, మనీష్ సిసోడియాను కోర్టు ముందు అధికారులు హాజరు పరిచారు. తదుపరి విచారణ జూలై 25వ తేదీకి వాయిదా వేసింది కోర్టు. జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా గత మూడు నెలల నుంచి కవిత తీహార్ జైల్లో ఉంటున్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు రెండు రోజుల క్రితం తిరస్కరించిన సంగతి తెలిసిందే. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో ఊరట ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ వాదనలతో న్యాయస్థానం ఏకీభవిస్తూ బెయిల్‌ను ఇవ్వలేమని చెప్పింది. హైకోర్టు బెయిల్ తిరస్కరించిన నేపథ్యంలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నది.

నార్కోటిక్స్ పోలీసులు కీలక నిర్ణయం..
గంజాయిపై సమాచారం ఇస్తే రూ. 2 లక్షలు నగదు

హైదరాబాద్ : రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలించడానికి తెలంగాణ నార్కోటిక్స్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి స్మగ్లింగ్ గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ. 2 లక్షల నగదు బహుమతి ఇస్తామని ప్రకటించారు. సమాచారం ఇవ్వాలి అనుకున్నవాళ్లు 8712671111 నంబర్‌కు కాల్ చేయాలని పోలీసులు సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని, అందుకోసం ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా విస్తృత ప్రచారం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరిన సంగతి తెలిసిందే. డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగస్వామి అయిన మెగాస్టార్ చిరంజీవిని ప్రత్యేకంగా అభినందించారు. ఆయనలా హీరో, హీరోయిన్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పౌరులకు అవగాహన కల్పించాలని కోరారు. మీడియా ఫోకస్ రాజకీయ అంశాలకే పరిమితం కాకూడదని, డ్రగ్స్, సైబర్ నేరాలపైనా దృష్టిసారించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ యజ్ఞం విజయవంతమయ్యేందుకు పౌరసంబంధాలశాఖ, పోలీసు, ఎక్సైజ్, ఫైర్, థియేటర్ యజమానులు, సినిమా ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై చిత్తశుద్ధితో పనిచేసే పోలీసులకు పదోన్నతులు, రివార్డులు ఇస్తామని తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య సైబర్ క్రైమ్స్, డ్రగ్సేనని సీఎం తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన నేరాలు, చిన్నారులపై అఘాయిత్యాలు డ్రగ్స్ మత్తులో జరిగినవేనని పేర్కొన్నారు. ఉద్యమాలకు కేరాఫ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్‌కు బానిస కావొద్దని పిలుపునిచ్చారు.

వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వాస్తవ నేస్తం,భీంపూర్: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల అధ్యక్షురాలు రత్నా ప్రభ సంతోష్ అధ్యక్షతన మండల సర్వసభ్యా సమావేశం నిర్వహించారు. అధికారులు తమ తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యవసాయాధికారి రవీందర్ మాట్లాడుతూ పీఎం కిసాన్ డబ్బులు పడని వాళ్ళు ఈకెవైసీ చేసుకోవాలని అన్నారు. రైతులు మీ పంటకు సంబంధించి ఏఈవో ల ద్వారా క్రాప్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారి సాయి తేజ మాట్లాడుతుండగా కరంజి(టీ)ఎంపీటీసీ రెడ్డి దేవమ్మ,రమేష్ కలుగా చేసుకొని విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మంగళవారం నుంచి రాజులవాడి గ్రామానికి కరెంట్ లేదని మండి పడ్డారు. జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ కలుగ చేసుకొని ఏప్పటికి అప్పుడు సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ వర్షాకాలం దృశ్య గ్రామాల్లో పారిశుధ్యం పై దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామని ఎంపీడీవో గడ్డం గోపాల కృష్ణ రెడ్డి తెలిపారు.. తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ 46 కళ్యాణ లక్ష్మి,షాది ముభారక్ అప్లికేషన్ లు,124 వివిధ సర్టిఫికెట్ లు పెండింగ్లో ఉన్నాయని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గడ్డం లాస్మాన్న,ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యం

వాస్తవ నేస్తం,భీంపూర్:పార్టీలకు అతీతంగా ఎంపీటీసీలు,సర్పంచ్ ల అందరి సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమైందని జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్,ఎంపీపీ రత్న ప్రభ సంతోష్ అన్నారు.ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ల పదవి కాలం ముగియడంతో బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల పాటు భీంపూర్ మండల ప్రజలకు సేవలందించేందుకు సహకరించిన ఎంపీపీకి,సర్పంచులకు, ఎంపీటీసీలకు,అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గడ్డం గోపాలకృష్ణ రెడ్డి తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలను పార్టీలకతీతంగా జెడ్పీటీసీ,ఎంపీపీ కార్యవర్గ సభ్యులు అన్ని రకాల అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. ఎటువంటి విభేదాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా అభివృద్ధి కోసం పాటుపడ్డనన్నారు. జెడ్పీటీసీ తమ జెడ్పీ నిధులతో ప్రతి గ్రామానికి సీసీ రోడ్డు,డ్రైనేజీ, బీటి రోడ్డు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మండల అభివృద్ధి కోసం పాటు పడాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంపీపీ,జెడ్పీటీసీ,ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్న ప్రభ సంతోష్,వైస్ ఎంపీపీ గడ్డం లాస్మన్న, కో ఆప్షన్ సభ్యుడు జాహూర్ అహ్మద్, తహసీల్దార్ సత్యనారాయణ,మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మాడావి లింబాజీ,మాజీ సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిఖని గనిలో మొక్కలు నాటిన డీఎఫ్ఓ

వాస్తవ నేస్తం,బెల్లంపల్లి: పట్టణంలోని శాంతిఖని గని షాఫ్ట్ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచిర్యాల డీఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్ శాంతిఖని గనిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. అనంతరం ఉద్యోగులతో పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి జీఎం మనోహర్, ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్, బెల్లంపల్లి ఎఫ్డీఓ విజయ్ కుమార్, ఎఫ్ఆర్ఓ సుభాష్, గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, ఎస్ఓ రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, ఏఐటీయుసి పిట్ కార్యదర్శి తిరుపతి గౌడ్, గని అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రోత్ మేళ కార్యక్రమాన్ని సమీక్షించిన కలెక్టర్

సిద్దిపేట : పిల్లల బరువు ఎత్తు మేళాను సంబంధిత శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రౌత్ మేళ కార్యక్రమం పై మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలలో 0 నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ బరువు ఎత్తు కొలిచే మేళాను సంబంధిత శాఖల సమన్వయంతో గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నిర్వహించిన పిల్లల బరువు, ఎత్తును సక్రమంగా నమోదు చేయాలని అన్నారు. గ్రామ పంచాయతీ తరపున పంచాయతీ కార్యదర్శులు గ్రౌత్ మేళా పై గ్రామాలలో ప్రచారం నిర్వహించాలని, ఏ ఎన్ ఎమ్ లు, ఆశ వర్కర్లు, మహిళా సంఘాలు అవసరమైన సహకారం అందించాలని అన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు గ్రౌత్ మేళాను సందర్శించి మానిటర్ చేయాలని అన్నారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో సప్లమెంటరీ ఫీడింగ్ ప్రోగ్రాం ప్రకారం చిన్నారులకు బాలామృతం, గుడ్లు, పాలు తదితరాలు సరిగా అందేలా చూడాలని అదేవిధంగా ఇండ్లలో కూడా సరిగా తింటున్నది లేనిది పరిశీలించాలని అన్నారు. ప్రతినెల చిన్నారుల హెల్త్ మెజర్మెంట్ తీసుకున్నప్పుడు వైద్య శాఖ సిబ్బంది గుర్తించిన చిన్నారులను సిద్దిపేటలోని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో గల న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్కు పంపించాలని అన్నారు. మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, త్రాగునీరు సౌకర్యం లేని ప్రభుత్వ భవనాలు కలిగిన అంగన్వాడి కేంద్రాల్లో వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వివిధ నిర్మాణ దశలలో ఉన్న అంగన్వాడి కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తయ్యేందుకు కావలసిన అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, డిపిఓ దేవకిదేవి, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యా, డిఎం అండ్ హెచ్ ఓ శ్రీనివాస్, మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి, ఇఇ పంచాయతీ రాజ్, సిడిపిఓలు అంగన్వాడి సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాల రవాణా పై దృష్టి సారించాలి: ఎస్పీ గౌస్ ఆలం

ఇచ్చోడ, బజార్ హత్నూర్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ

వాస్తవ నేస్తం,ఆదిలాబాద్: నిషేధిత పదార్థాల రవాణా పై దృష్టి సారించి, నిషిద్ధ పదార్థాలను పూర్తిగా అరికట్టాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. ఎస్పీ బుధవారం ఇచ్చోడ బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు చేశారు. ఈ సందర్భంగా పోలీసుల నుండి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. స్టేషన్లలోని పలు రికార్డులను పరిశీలించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు అతిగా కురుస్తున్న సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ లోతట్టు ప్రదేశాలకు గానీ, వాగులు వంకలు తదితర ప్రమాదం గల ప్రదేశాలకు వెళ్లకుండా జాగ్రత్త గా ఉండాలి అని ప్రజలకు తెలియజేయాలన్నారు. పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ఎస్పీ వెంట సీఐ భీమేష్, బజార్ హత్నూర్, ఇచ్చోడ ఎస్సై లు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎంపీపీ రవీందర్ గౌడ్

వాస్తవ నేస్తం,పటాన్చెరు: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ ఎంపీడీవో అరుణ వైస్ ఎంపీపీ గంగు రమేష్ ఎంపిటిసిలు జానా బాయ్ లావణ్య నరేష్ సంతోష మహేష్ తో కలిసి 30 లక్షల నిధులతో జిన్నారం వావిలాల చౌదరి గూడెం కొర్లకుంట మాదారం కొడకంచి మంగంపేట్ ఉట్ల రాలకత్వ శివానగర్ అండూర్ ఇమామ్ నగర్ గ్రామాలలో శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడం జరిగిందని మరో పది రోజుల్లో మూడు కోట్ల నిధులతో జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారి చేత అభివృద్ధి కార్యక్రమాలు శంకుస్థాపనలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిన్నారం మండలం మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అండూరు సత్యనారాణ, మంగంపేట గణేష్, జయప్రకాష్, రాజు గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, నారా బోయిన శ్రీనివాస్, విష్ణుమూర్తి చారి,మాజీ ఉప సర్పంచ్ లు జింకల రవి, రమేష్, రవి గౌడ్, గ్రామ కార్యదర్శులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల సన్మాన సభ

– హాజరైన జడ్పీ చైర్మన్ ప్రభాకర్

వాస్తవ నేస్తం,పటాన్చెరు: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలో పదవి ముగిసిన సర్పంచ్ ఎంపీటీసీల సన్మాన సభ కార్యక్రమం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవడ చేయడం కోసం పరితపించే వారే రాజకీయాల్లోకి వస్తారన్నారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్ ఎంపీటీసీల పాత్ర కీలకమైంది అన్నారు. అనంతరం సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను శాలువాలతో మన్నించారు.

ఒక వ్యక్తికి టక్కరిచ్చి పారిపోయిన వ్యాగనర్ కారు డ్రైవర్

చాకచక్యంగా టెక్నాలజీతోఅరెస్టు చేసిన సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు..

సిద్దిపేట : విద్యాసాగర్ త్రి టౌన్ ఇన్స్పెక్టర్ కేసు వివరాలు తెలియపరుస్తూ.. దుద్దెడ గ్రామ శివారులో హరిత హోటల్ సమీపమున సిద్దిపేట–హైదరాబాద్ రాజీవ్ రహదారి ప్రక్కన ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి అను ఆతను రోడ్డు ప్రక్కన చెట్లలో పడిచనిపోయి ఉన్నదని, శవమును గుర్తు పట్టడానికి విలులేకుండా ఉబ్బిపోయి, చర్మం ఉడిపోతుంది, ఎడమ కాలు మణికట్టు పై భాగం విరిగి ఉన్నది. మృతుడి జేబులో వెతకగా ఎలాంటి వివరాలు తెలియలేదు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv (K), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv (K), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com